ఈ వారం కథ

# జీవసూత్రం

— క్రాంతి

“ఇప్పుడికి తెరిపిచ్చిందిర్నాయిన; మూ(డ్రో)జుల్నుంచి ఎక్కడికీ యెల్లనివ్వకుండ కట్టిపడీసింది గదా యీ ముసురు. అందుకే అంతారు ‘కొండంత ఎండకి బరించగలంగానీ సినమంత సినుక్కి ఓర్స నేమని...”

పాకలోంచి బయటకి వచ్చి తలెత్తి చూసేడు నరసయ్య. విడిపోతున్నట్లే వున్న మెరకల మీద పరుగులు తీసే ఆలమందల్లా కదలాడుతూనే వున్నాయి మబ్బులు. మూడు దినాలుగా పట్టిన ముసురు తగ్గినట్లైంది. ఎండ కాయట్లేదు కానీ తెల్లని వెలుగు అంతటా పరుచుకుంది.

ఇంటి ముంజూరు నుండి వాన నీరు బొట్లు బొట్లుగా జారుతోంది, నందివర్ధనం చెట్టు నుండి ఒక్కొక్క పువ్వు గాలికి రాలి పడుతున్నట్లు.

పిల్లలు బిలబిలమంటూ యిళ్ళలోంచి వీధుల్లోకి చేరి బురదలో తపతప అడుగులు వేస్తూ గంతులేస్తున్నారు. జారి పడుతున్నారు. వీధిలో పారుతున్న వర్షపునీటిలో కాగితం పడవలు చేసి వదుల్తూ కేరింతలు కొడుతున్నారు.

కోళ్ళు యిళ్ళ గడపల నుండి గాదెల అరుగుల మీది నుండి రెక్కలు విదిలించి వీధిలోకి వురికి బురదను కెలుకుతూ పురుగు లేరుకుంటున్నాయి.

“అవ్వ నా గుంపా బక్కలిప్పుకోనెల్లి మేపుకోని రాగూడదా.. మూ(డ్రో)జుల్నుంచి అలాగ బురదల కట్టుకొయ్యిల్దగ్గిరే వుండిపోనాయి. పాలంత గత్తర గత్తర గుంది. ఆట్నే సూత్తె వుసూరు మంతంది. ఎల్లిమీ.”

వీధిలోంచి కేకేసేడు నరసయ్య కొడుకు గుంపడిని.

“ఆ..ఆ ఎల్తాను” అని బదులుపలికి ములుకోల పట్టుకుని బద్దల గిడుగు తల మీద వేసుకుని వీధిలోకి వెళ్ళేడు గుంపడు. గుంపడికి ఇరవయ్యేళ్ళుంటాయి. ఆ యింటికి కేంద్ర బిందువు వాడే.

నరసయ్య గడపలోకి వచ్చి కూర్చుని చుట్ట ముట్టించి అడ్డపాగ వేసి సగంలో ఆపిన తాడు చేతిలోకి తీసుకుని జనపనార తడపర్ని తీసి తాడు పేనడంలో మునిగిపోయేడు.

“ఓలమ్మ ఓలమ్మ.. నానీ వూరు కాపరానికొచ్చిన్నుంచి యింతేరు రావడం నానెప్పుడు సూడ్నేదు. అవతలొడ్డు అయ్యగారి తోట లెల్లి.. యివతలి పొలాల మీద లెల్లి కెరటాలేసి పారతంది. ఒవ్వో.. క్రరలు.. అంతడేసి దూలాలు ఏటంట కొట్టికెలిపొత్తన్నాయి...” అంటూ వచ్చింది పారమ్మ తల మీద నీళ్ళ కుండతో.

నరసయ్య ఓసారి తల పైకెత్తి చూసి “ఆ ...” అని ఆశ్చర్యం ప్రకటించి మళ్ళీ తన పనిలో పడిపోయేడు. ఎదురింటి సోములు నరసయ్య దగ్గరకొచ్చి ప్రక్కనే కూర్చుంటూ అన్నాడు.

“నరసయ్య తాతా.. మూ(డ్రో)జుల్నుంచీ అలాగ కూకోనుండిపోనాం. పనీ నేదు..పాటూ నేదు. ఏరొచ్చింది గదా.. క్రరలు తెద్దుంవేటి.. పొయ్యి బాదేనా తీరతాది”

“నిజంవే గానీ మన రేవుని క్రరలు తియ్యడానికి వాటాంగాదు. అవతలూరోలికి, ఆ దిగవూరోలికీ మా బాగ కుదిరింది. ఇప్పుడేటి గాని నా



సోవులో.. నానునీలాగుంతప్పుడు.. యేరొత్తే సాలు ఒక్కడ్నే రెండు బళ్ళు కలప తీసోడ్ని.. నీకు సెప్పితబద్దంవూ...” యేదో తన గొప్పతనం గురించి ఒకనాటి ముచ్చటేదో చెప్పబోయేడు.

“ఔనుగానీ తాతా.. యింతో ఏరు యెప్పుడైన ఒచ్చిందా..” అడిగేడు సోంవులు.

నరసయ్య తల పైకెత్తి కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పేడు.. “నా పెళ్ళైన సంవచ్చరము యిలగే ముసురుబెట్టీసింది. ఆ(రో)జులు యిల్లు కదల్నివ్వనే దనుకో.. అప్పుడేగదా మన గుంప కోవిలి పడిపోయింది. నాగావలి తల్లి పొంగిపోయి ఆ పాత కల్లికోట ముంచీసింది” అని ఆరిన చుట్ట చెవ్వు సందులో దోపి...

“ఆ తరవాత... పుష్కరమయ్యింతాది మల్లీ తుపాను వొచ్చింది. అప్పుడూ యిలగే... దిగవ దేశాన శానమంది సచ్చిపో(మ...” యిలా చెప్పుకుపోతున్న నరసయ్యకు అడ్డుతగుల్తూ యింట్లో నుండి కేకేసింది పారమ్మ.

“ఔనో... కూకోని కవుర్లాడుకోపోతే ఆ యేటికాసి యె(ల్లా)దా.. రెండు క్రరపుల్లలేనా తేనా..? పొయ్యిలోకి నేక యిబ్బంది పడిపోతన్నాం గావాల..”

“ఒరే సోంవులో యిది మరి బతకనివ్వదురా.. యెల్లిందాకా పేనం తినేత్తాది.. పదరా” అని లేవబోయేడు నరసయ్య.

అప్పుడు వినిపించిందో చప్పుడు; చెవులు చిల్లులు పడేలా.. పెట్లిల్లని

**ప్రకృతిలో వచ్చిన పరిణామాలకు తట్టుకోగలిగేట్టు మారగలిగిన ప్రాణులు తమ మనుగడను నిలుపుకోగలిగితే, తట్టుకోలేనివి అంతరించాయని, జీవ పరిణామ శాస్త్రం తెలియజేస్తుంది. ప్రత్యేకించి ఆలోచించలేని ప్రాణులే అనివార్య పరిస్థితిలో ప్రతిఘటించి ప్రకృతి అనంత శక్తితో పోరాడుతున్నాయంటే,**

మిన్నువిరిగి మీద పడ్డట్టు మేఘ గర్జన. దాంతో పాటే మళ్ళీ వర్షం ఆరంభమైంది.


లేవబోతున్న నరసయ్య తాత అదిరిపడి అక్కడే కూలబడ్డాడు "అర్జునా.. ఫాల్గునా.." అంటూ. సోములు తుళ్ళిపడి గుండెల మీద తుప్పు తుప్పున వూసుకుని... "ఏటీ గోటింపు. గుండెలవిసిపోనాయిర్నాయిన" అన్నాడు అక్కడే కూర్చుండిపోతూ.

ఆ మేఘగర్జనకు వీధిలో ఆడుకుంటున్న పిల్లలంతా యిళ్ళల్లో దూరేరు. కోళ్ళు గాదెల అరుగుల మీదికి చేరుకున్నాయి.

"ఒరే యీదరిదాపుల్లోనే ఎక్కడో పడ్డాదిరా పిడుగు" అన్నాడు నరసయ్య సాలోచనగా.

కొద్ది క్షణాల్లో ఒక వార్త వూరంతా కమ్ముకుంది వరదొచ్చి యిసుక పర్రల్ని కమ్ముకున్నట్టు.

'ఊరవతల మెరక మీద పసువులు మేపుతున్న ఎవరో ఒక పిల్లాడి మీద పిడుగు పడింది' — అదీ ఆ వార్త.



ఎవరి మీద పడిందో తెలీదు. ఎవరు బలైపోయేరో తెలీదు. ఆత్రంగా వూరు వూరంతా మెరకవేపు పరుగు తీసింది.

వర్షం కురుస్తూనే వుంది.

గొడుగులు వేసుకుని కొందరు, బద్దల గిడుగులు, తాటాకు గిడుగులు వేసుకుని కొందరు... తడుస్తూనే కొందరు...

వూరవతల విశాలమైన మెరక. మెరక ప్రక్కనే పాంగిపార్లి ప్రవహిస్తున్న గెడ్డ. ఆ మెరక మధ్య వెల్లకిలా పడివున్నాడో కుర్రాడు. జీవం లేని కళ్ళు గాజు గోళాలై చూపులు శూన్యంలో నిలిచిపోయేయి. వాడు గుంపడు.

మెరక మీదికి పాంగుకొస్తూ వాడి కాళ్ళ వేపు ఆక్రమించుకొస్తోంది గెడ్డ వరద నీరు.

పశువులు దూరంగా చెదిరి పచ్చిక మేస్తున్నాయి.

జనం వురుకులు పరుగులతో చేరుకున్నారక్కడికి. సామ్ములు కాసే పిల్లలు యిలా వివరించేరు.

"మా మందరం బక్కలు కాసుకోని మనిసాక దగ్గిర కూకున్నాము. అప్పడికింక సల్లందులు తిన్నేదు; గుంపడు.. అల్లదా.. ఆ పిమ్మడి దగ్గిరికెల్లి బీడీ ముట్టించుకోని యిలగెల్లాడో నేదో.. గఢేలుమని గోటించింది. మనిసాక పక్కకి పడిపోయి.. పడిపోయి పారిపోవాం. యెవులేటైపోవారో యేటో.. యేటీ తెలీనేదు."

"ఓర్నా కొడుకో.. ఎంత పనైపోయిందిరో. నానేన్నా ఆ బక్కలిప్పి కొచ్చినాను గాన్నో.. ఆ ముచ్చు దేవతకి కోరి నిన్ను ఒప్పజెప్పేసినాన్నో నాయినా.." భోరున యేడుస్తూ శవం మీద పడిపోయేడు నరసయ్య. పారమ్మను ఎవరూ పట్టలేకపోతున్నారు. ఏడుస్తూ విరుచుకుపడుతోంది. అప్పటికే గెడ్డ నీరు మెరకను సగానికి ఆక్రమించింది. వర్షం యింకా ఎక్కువైంది.

భోరున వర్షం.. హోరు గాలి.. ఏడ్పులు.. పెడబొబ్బలతో ఆ ప్రదేశమంతా మార్మోగిపోయింది. అందరిలోనూ ఓ విధమైన చిత్రమైన.. యిదీ అని చెప్పలేని భావన - ఆందోళన - ఆవేదన.

"మా ఘనమైన గుంటడ్రా.. యింటికి యిడే ఆధారం నాగుండోడు."

"ఎవులేటన్నా పట్టించుకుండోడు కాదు. ఎవులేపని సెప్పినా సేసీసోడు."

"ఒరే... మంచోడ్నే దేవుడు బేగి తీసికెలిపోతాడ్రా.."

ఒక్కొక్కరూ ఒక్కో మాటన్నారు. గుంపడి మంచితనాన్ని పొగిడేరు.. సానుభూతి చూపించేరు.

శవం వూర్లోకి తరలించబడింది.

జన ప్రవాహం వూరి వేపు కదిలింది.

* * *

"బావూ.. ఏటిసేత్తాం సాశానానికి తీసికెలిపోదుంవేటి?" అన్నాడో ముసిలోడు గ్రామ సర్పంచ్‌తో. ప్రెసిడెంటు మాజీ మునసబు వేపు చూసేడు. మునసబు పాత కరణం వేపు చూసేడు. కరణం ఎవరి వేపూ చూడకుండా ఓసారి కళ్ళు మూసుకుని ఆలోచనలో పడిపోయేడు.

పంచాయితీ ఆఫీసు.., ఆ ఆఫీసు గడపలో నులక మంచమ్మీద శవం. శవం చుట్టూ.. జనం.

కరణం చెప్పేడు "యిది ఎవరు చేసిన నేరమూ కాదూ.. కానీ.. పోలీస్టేషన్‌కి తెలియజేయకపోతే ఆ తరవాతొచ్చింది కాసుకోవాల గదా.. అదిప్పుడాలోసించాల."

"వూరందర మొకటైతే ఎవులేటి సేత్తారు? అందరమొకటనుకోని దహనం సేసీడిమే వుత్తమం. ఆ పోలీసులుకి సెప్తే అదొక తంటా" అన్నాడు పాత మునసబు.

"నాయుడు మావు మా బాగ సెప్పినాడు. అదే మంచిది" అనుకున్నారంతా. అప్పుడు ప్రెసిడెంటన్నాడు.

"నిజంవే.. మునసబు మావ చెప్పింది బాగానే వుంది" అని కొంచెం సేపాగి "అవునర్రా.. ఏటంతారు" అని సమాధానం కోసం జనంవేపు చూసేడు.

"మరేట్నే బావూ.. ఆ పోలీసోలికి సెప్తే ఆలొచ్చి శవాన్ని ముక్కలు ముక్కలు కోస్సి దొక్కు మనకిత్తారు. అదైనా ఎప్పుడిత్తారో దాని కెంత తతంగంవో" అన్నాడొకడు జనం లోంచి.

"ఓరె పల్లకోరా యిప్పుడు మనం పోలీసులకి సెప్పప్పోతే రేపెవుడేనా యీ సంగతి ఎక్కడేనా బుస్కితే? వూరందర్ని పెట్టెత్తారు జైల్లో.." మరొకడు భయం ప్రకటించేడు. అది ప్రెసిడెంటు విన్నాడు.. విని నాయుడి వేపు చూసేడు. నాయుడు తన వేపు చూడకముందే కరణం అన్నాడు —

"అదిగో అదే వచ్చిన చిక్కు. మనిషొక మాటంటేనే వచ్చింది తంటా. యిలగైతే లాభం లేదు."

శవం దగ్గర యేడ్చి యేడ్చి అలసిపోయిన పారమ్మ.. నరసయ్య దీనంగా

ఆలోచించగల, చైతన్యవంతులైన మనుషుల సంగతి చెప్పనక్కర్లేదు. గొర్రెల వంటి మనుషులు అన్యాయం గుండె పగిలేలా ఢీ కొన్న సందర్భాలెన్నో! ఆ సహజ చైతన్యమే లేకపోతే సమాజం మరెంత భయంకరంగా, మరెంత దారుణంగా, మరెంత అమానుషంగా వుండేదో?

చూసేరు.

ఒక్కో చినుకును రాలుస్తూ మబ్బులు తమ సంతాపం తెలుపుతున్నాయి. గాలి జాలిగా వీస్తూ తన బాధను ప్రకటిస్తోంది.

''అవున్రా.. పోలీసులుకి సెప్పాల నిజఁవే.. ఐతిప్పుడెందల పడిపోతాం రా.. యిటు సూత్తె గెడ్డ పొంగిపోతంది. వాగావల్లల్లి యిరగబడి తిరగబడిపోతం దవతల పక్క — శవాన్నింక ఎంతసేపుంచుతాం వూర్ల? సేనమందికి తిల్లూ నేవు.. తిప్పల్నేవు..'' అసహనంగా అన్నాడొకడు.

''దహనం చేసెద్దాం'' అన్నారు కొందరు.

''పోలీసులకి సెప్పప్పోతే ఎలాగా'' అన్నారు కొందరు.

తర్జన భర్జనలు జరిగేయి.

వాదోపవాదాలు చెలరేగేయి.

ఓ ముసలోడన్నాదు ముడతలు పడ్డ ముఖం పైకెత్తి కళ్ళు చికిలించి వేళ చూసి —

''మరింకెందుకు తర్జన భర్జన్లు యేల మించిపోతంది. వల్లకాటి కిప్పుడు ఎలాగూ తీసికెల్నేము.. యేటిసేసినా రేపే గదా?''

''ఓను మరి. యిప్పుడేటి చెయ్యగలం; ఎలాగూ యీసంగతి చాలామందికి తెలిసిపోద్ది. మనం దాచీసి ప్రయోజనం లేదు. రేప్పొద్దున్న చీకటితోటి పోలీస్టేషనుకి పంపిద్దుంగాని కవురు. తెల్లారీసరికి గెడ్డ కసెంత తగ్గుతాది'' అన్నాదు ప్రెసిడెంటు యిప్పటికిదే నిర్ణయం అన్నట్టు.

భజన సమాజంవాళ్ళు శవం దగ్గర భజన చేయడానికి వారి సన్నాహాలు వారు చేసుకుంటున్నారు.

చీకటి క్రమంగా తన పిడికిలి బిగిస్తూ వూరిని తన గుప్పిట్లోకి తీసుకుంటోంది.

* * *

అసహనంగా.. ఆత్రంగా ఎదురుచూస్తున్నారు గ్రామస్తులు పోలీసుల రాక కోసం. మధ్యాహ్నం ఒంటిగంట కావస్తోంది. శవం వూళ్ళో వున్నంత వరకూ అన్నం ముట్టకూడదనే నియమం కలవాళ్ళు.. ఎక్కడి వారక్కడే చేరబడి పోయేరు. అప్పుడు అడుగుపెట్టేరు వూళ్ళోకి ఎస్పైగారు.. అతని వెనక యిద్దరు కానిస్టేబుళ్ళు.

ఎస్పైగారు వీధి చూసేరు.. ఇళ్ళు పరికించేరు. పెంకుటిళ్ళు, డాబా యిళ్ళు, అక్కడక్కడ అధునాతనంగా కట్టబడిన యిళ్ళు... పొందిగ్గా కనిపించేయి. 'ఫరవాలేదు వూరు పూరైందే' అనుకున్నాడు. అలా అనుకోవడమే కాకుండా, యీ నియోజకవర్గం ఎమ్మెల్యేకి యీ వూరు 'ఎగస్పార్టీ' కాబట్టి 'మన పవరు' చూపించినా మరేం ఫరవాలేదు అని అనుకున్నాడు.

గ్రామ సర్పంచు.. పెద్దలు, యువకులు ఎదురెళ్ళి ఎంతో వినయ విధేయతలతో తీసుకొచ్చేరు.

ఎస్పైగారన్నారు బిగుసుకుపోతూ ''శవమెక్కడ?''

''పంచాయితీ ఆఫీసు దగ్గర సార్.. రండి'' అంటూ ప్రెసిడెంటుగారు ముందు దారి తీసేరు. అంతా అటు కదిలేరు.

ఎస్పైగారు తన భారీ కాయాన్ని కుర్చీలో చేరవేసేడు. కుర్చీ ఆ బరువును మోయలేకనేమో కిర్రుమని మూలిగింది. ఇద్దరు కానిస్టేబుళ్ళు శవం దగ్గరగా వెళ్ళేరు. శవమ్మీద కప్పిన బట్ట తొలగించమనీ.. అటు తిప్పమనీ.. యిటు తిప్పమనీ శవాన్ని ఆపాదమస్తకమూ పరికించేరు, పరిశీలించేరు.

తల మీద పిడుగుపాటువలన అయిన గాయం వుంది. ఆ గాయం లోంచీ.. ఎడమ చెవినుండీ రక్తం స్రవించి చారికలు కట్టింది. శవం నలుపు రంగుకు తిరిగి చెడు వాసన వేస్తోంది.

''ప్రమాదం జరిగే సమయంలో అక్కడ ఎవరెవరున్నారో వాళ్ళందరినీ పిలిపించండి సర్పంచ్‌గారూ'' ఆదేశించారు ఎస్పైగారు.

కొద్దిసేపట్లో పశువులు కాసే పిల్లలు ఆరుగురూ వచ్చేరు. ఆ ఆరుగురిలో యిద్దరు 'గుంపడు' యీడువాళ్ళు. మిగితా నలుగురికీ.. పదీ.. పదకుండేళ్ళు వుంటాయి. బితుకుబితుగ్గా వచ్చి ఎస్పైగార్ని భయంగా చూసేరు.

''పిడుగు పడటం మీరు చూశారా? ఎలా వుంది? ఎంత పొడవుంది..'' ఎస్పైగారడిగేరు.

పిల్లలు భయంతో నోరు విప్పలేదు. జనం లోంచి ఒకడన్నాడు చిన్నగా ''పిడుగు ఎవుడైనా సూడగల్డా... అడిగినోడికి బుర్రుండాల.''

ఆ మాట ఎస్పైగారి చెవిదాకా వెళ్ళలేదు.

''చెప్పండ్రా..'' గద్దించేడు.

పిల్లలు బిక్కమొహాలు వేశారు ఆ గద్దరింపుకి. ప్రెసిడెంటుగారు కల్పించుకుని అనునయంగా అన్నారు ''చెప్పండ్రా.. ఫరవాలేదు''

''మా మందరము బక్కలు కాసుకోని మనిసొక దగ్గిట కూకున్నాము. అప్పుడు కింక సల్లందులు తిన్నేదు. గఢేలుమని గోటించింది. కల్లు సిట్టి సీకటి కమ్మీసినాయి. ఏటైందో యేటో మరి మాకు తెలీనేదు. గుంపడు మాత్రం పడిపోండు. బయిమేసి పారొచ్చినాం'' చెప్పేడు ఓ గడుసుపిల్లడు.

''ఎప్పుడు గర్జించింది? నాకు వినిపించలేదే..''

''అప్పుడు తమరే పార్టీలో వున్నారో యేటో. అందుకే వినిపించి వుండదు'' అన్నాడో యువకుడు జనంలోంచి వ్యంగ్యంగా. ఎస్పైగారు చివ్వున తలతిప్పి చూసేరు. మునసబుగారు యువకుణ్ణి మందలించేరు.

''మీరంతా కలిసి ఆ కుర్రాణ్ణి చంపేసి పిడుగు పడిందని అబద్ధాలు చెబుతున్నారు.. కదూ?''

ఎస్పై యమధర్మరాజులాగా.. కానిస్టేబుళ్ళిద్దరూ యమభటుల్లాగా కనిపించేరు ఆ పిల్లలకి.

''నేదు బావూ...'' ఏడవడానికి సిద్ధంగా వున్నారు. జనం అసహనంగా వింటున్నారు.

ఎస్పైగారు కానిస్టేబుల్సు వైపు చూసేరు.ముగ్గురూ కళ్ళతోనే మాట్లాడుకున్నారు. అలా మాటాడుకున్నాక ఎస్పైగారన్నారు... ముఖం కందగడ్డలా చేసి.

''నాకిదేదో అనుమానంగా వుంది. ఆ కుర్రాణ్ణి హత్య చేసి ఆ విషయం బయటపడిపోతుందన్న సంగతి మాకు తెలిసిపోతుందేమోనని పిడుగు పడిందని మాకు కబురుచేసి నాటకమాడుతున్నారు కదూ మీరంతా. యిదేం బాగా లేదు సర్పంచ్‌గారూ — అందర్నీ మూసీవలసి వస్తుంది'' అస్త్రం ప్రయోగించేరు ఎస్పైగారు.

''లేదండి.. అదేం లేదు. ఆ కుర్రవాడు పిడుగుపడ్డం వల్లే చచ్చిపోయాడు'' చెప్పేదు సర్పంచ్.

''అవునండీ.. అంతే'' అన్నారందరూ.

''నేన్నమ్మను.. పోస్టుమార్టం చేయవలసిందే - తప్పదు'' కళ్ళజోడు పెట్టుకున్న కోరమీసాల కానిస్టేబులన్నాడు కొరకొర చూస్తూ. ఆ మాటలకు

**(ప్రఖ్యాత బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి ఒకానొక ఇంటర్వ్యూలో 'రచయితలకు మీరిచ్చే సందేశం ఏమిటి?' అన్న ప్రశ్నకు ఇచ్చిన సమాధానం)**

**''ప్రజలతో వుండండి. ప్రజల వించి నేర్చుకోండి. వాళ్ళ కోసం రాయండి. మట్టి వాసవల వెచ్చదవాన్ని మీలో నింపుకోండి. సాధారణ ప్రజలు మనకంటే తెలివైనవాళ్ళు. ఈ కష్టాల వ్యవస్థలో ఎలా బ్రతకాలో వాళ్ళకు తెలుసు.''**

**సేకరణ:**

**—తవుటు నాగభూషణం**

గతుక్కుమన్నారు ఏడ్చి ఏడ్చి అలిసిపోయి నిస్సత్తువగా.. నీరసంగా.. దిగాలు పడివున్న పారమ్మ — నరసయ్య.

''ఇదేట్బాయిన. శవమైనా మాకు దక్కనివ్వరు గావాల''. అంటూ బావురుమన్నారు.

జనాల్లో కలకలం రేగింది. అంతా కలసి ఎస్సైగార్ని బతిమాలుకున్నారు. ప్రాధేయపడ్డారు. నరసయ్య, పారమ్మ ఎస్సైగారి పాదాల మీద పడిపోయేరు. బావురుమన్నారు. ఎస్సైగారు కరిగిపోలేదు సరికదా రెచ్చిపోయేరు. ''ఆ కుర్రాణ్ణి మీరే చంపేశారు'' అన్నారు. అందర్నీ బయటే వుంచి పొమ్మల గుంటల్ని మాత్రం గదిలో పెట్టి లాఠీ చేతిలోకి తీసుకుని అన్నారు. ''ఆటలాడుకుంటూ తగాదా వచ్చి మీరంతా కల్సి వాణ్ణి చంపేశారు. ఇదే నిజం'' అని కేకలు వేసేరు. లాఠీని వాళ్ల వీపుల మీద చిరు నాట్యం చేయించేరు. కుర్రాళ్ళు బయటికి వచ్చేరు. వాళ్ళను చూసిన గ్రామస్తులకు కడుపు చెరువయింది. రక్తం మరిగిపోయింది. ఆవేశం కట్టలు తెంచుకుంది.

''ఇదో నాటకం గావాల ధబ్బులు దేవుకోడానికి'' ఓ కుర్రాడన్నాడు ఆవేశంగా.

ఖాకీ దుస్తులు మరోసారి కళ్ళా కళ్ళా కలుపుకున్నాయి. కళ్ళజోడు కానిస్టేబులు ప్రెసిడెంటుగార్ని ఓ మూలకు తీసుకెళ్ళి చెవిలో వివరించేడు.

''చూడండి ప్రెసిడెంటుగారూ.. ఎస్సైగారికి అనుమానం బలంగా వుంది. పోస్టుమార్టం.. చెయ్యడం.. కేసూ- గీసూ.. ఆ తతంగమంతా ఎందుకు...'' అని యింకా స్వరం తగ్గించి గుసగుసగా అన్నాడు ''ఐదువేలు సర్దుబాటు చేసేయండి ఎలాగోలా అయ్యగారికి నేను నచ్చజెప్తాను. మీకూ యేం తెలీనట్లు అలా పల్లకుంతారేటి...''

అది విన్న ప్రెసిడెంటుగారు అవాక్కైపోయేరు. ఆ మాట మునసబు చెవిలో వేసేరు. మునసబు కరణం చెవిలో చెప్పేడు. కరణం కుర్రాళ్ళ చెవిలో వూదేసేరు. విషయం గుసగుసలుగా అందరి చెవుల్నీ చల్లగా చేరింది. చల్లగా చేరిన ఆ వార్త వెచ్చగా పాకింది. వేడెక్కించింది. అందరికీ వుడుకెత్తిపోయింది.

''కోవిటోణ్ణి సూసి నక్క సొంటి కొమ్ము అడిగిందట.. పల్లెటూరోలంటే బైతుగాళ్ళని ఖాకీ బట్టలు సూపించి, కళ్ళెర్ర జేసి బెదిరించి బుక్కెయ్యాలని సూత్తం్రడు గావాల'' అన్నాడొకడు ఎగిరిపడుతూ.

''నేపోతే — యిదేటి గోరం! గుంటడు పిడుగుపడి సచ్చి మనమేడుత్తుంటే సంపేశామంతాడేటి? ఐదు వేలు యిచ్చితే పిడుగుపడ్డాదని నమ్ముతాడుగావాల. మనమిప్పుడు డబ్బు యిచ్చీశామనుకో.. సంపేసినట్టు ఒప్పుకున్నట్టే కదా'' సంయ్‌న లేచేడొకడు.

''ఛస్.. యేమైతే అదవ్వనీగానీ డబ్బు మాత్రం యివ్వగూడదు. కాపోతే ఆ సొమ్ము ఎత్తుబడి సేస్సి తరవాతొచ్చిన సంగతి సూసుకుందుంగానీ'' మరొకడన్నాడు వుద్రేకంగా.

యువకులంతా రామ్మందిరం దగ్గర సమావేశమయ్యేరు. సమావేశంలో ఒక నిర్ణయం చేసుకున్నారు. ఆ నిర్ణయం పెద్దలకు వినిపించేరు. యువకులూ, పెద్దలూ కూడబలుక్కుని వూరందరికీ వివరించేరు.

''ఇప్పుడుగాని మనం ఒక మాట మీద నిలబడకపోతే వూరంతా మునిగిపోద్ది'' అని హెచ్చరించేరు.

చిన్నపిల్లాడి నుండీ ముసలాడివరకూ అదో చాలెంజ్‌గా తీసుకున్నారు. అందరిలోనూ పట్టుదల.. సమైక్యత కలిగించిన సంతృప్తీ, సంతోషం వారి హృదయాల్ని ఆవరించింది. సమరోత్సాహం లాంటి వుత్సాహం వారిని కుదిపేసింది.

ఎస్సైగారు పంచాయితీ ఆఫీసులో అసహనంగా పచార్లు చేస్తూ సర్పంచ్‌కు కబురు చేసేరు. జరుగుతున్న జాప్యానికి చిరాకుపడ్డారు.

''మన్నించండి ఎస్సైగారూ.. కొద్దిగా ఆలస్యమైంది.. సొమ్ము వ్యాపకంలో పడీ..'' వస్తూనే అన్నాడు ప్రెసిడెంట్ వినయంగా.

''ఫరవాలేదులెండి.. శవాన్ని దహనం చెయ్‌డానికి తీసుకెళ్ళమనండి'' చిరునవ్వుతో అంగీకరించేరు ఎస్సైగారు.

కళ్ళజోడు కానిస్టేబులు.. కోరమీసం సవరించుకున్నాడు.

ఏడ్పు ఘోషల మధ్య చావు మేళంతో శవం స్మశానానికి తరలించబడింది.

పంచాయితీ ఆఫీసులో ఖాకీలు కాగితాలవీ రాయడం పూర్తిచేసి 'రాబోయే కాగితాల' కోసం చూస్తున్నాయి.

పది మంది యువకులు ఎస్సైగారి దగ్గరకొచ్చేరు. వారు ఏ క్షణానైనా గండి కొట్టడానికి సిద్ధంగా వున్న వరద నీటిలా వున్నారు. అందరూ ఎస్సైగారికి నమస్కారం చేసేరు. జాగ్రత్తగా గమనించగలిగితే వాళ్ళ చిరునవ్వు ముఖాల వెనుక ఎగిసిపడే అగ్నికీలలు అగుపడేవి ఎస్సైగారికి. కానీ ఆయన దృష్టి ఒక యువకుడి చేతిలో వున్న 'కేష్ బాగ్' పైనే వుంది.

''అందరూ ఎందుకు ఒక్కరు రండి చాలు'' అంటూ చిరునవ్వుతో గదిలోకి దారి తీసేరు ఎస్సైగారు కుర్చీలో కూలబడుతూ.. ''ప్రెసిడెంటుగారు రాలేదా..'' అనడిగేరు.

కాష్ బేగ్ పట్టుకున్న యువకుడు చెప్పేడు..

''ప్రెసిడెంటుగారు .. శవానికి అంత్యక్రియలు జరిపించే పనిలో వున్నారు సార్. నేను వాళ్ళబ్బాయిని. మేమందరం ఒకో కుటుంబానికి ఒకరం వచ్చాము. యిది పల్లెటూరు గదండీ.. మంచైనా, చెడ్డైనా అంతా కలిసి పంచుకోవాలి. ఏ ఒకరి మీదా మరొకరికి అనుమానం రాకూడదనీ అందరమూ వచ్చేము.''

''సరే రండి'' అన్నారు ఎస్సైగారు.

అందరూ గదిలో అడుగుపెట్టేరు.

ఆ గది తలుపులు మూసుకున్నాయి.

* * *

అక్కడేం జరిగిందో యేమో గానీ అరగంట తరువాత ఆ మునిమాపువేళ ముగ్గురు వ్యక్తులు బురదలో పడుతూ లేస్తూ.. పరుగులు తీస్తూ వూరు దాటి పారిపోవడం మాత్రం కొందరు చూసేరు(ట).

లోకంలో ఎన్నో ధర్మాలున్నాయి. సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపించడానికి ఎన్నో చట్టాలున్నాయి. నీతి సూత్రాలున్నాయి. ఐనా జరగవలసిన అక్రమాలు జరుగుతూనే వున్నాయి.

మారుతున్న కాలంతోపాటు ధర్మాలు మారుతున్నాయి.. కానీ.. కాలం మారినా తరాలు మారినా ఎన్నటికీ మారని 'సూత్రం' మాత్రం ఒకటుంది.

'పూజలందుకుని కాపాడవలసిన దైవం కాలనాగై పడగవిప్పి కాటేయబోతే 'ఆత్మరక్షణార్థం' అమాయకత్వం తనకుతానై కాలిగోళ్ళను కత్తులుగా మార్చుకుని ముక్కును ఈటెగా మలచుకుని గరుడపక్షై రెక్కలు విదిలిస్తుంది!

మానవ ప్రాణికే కాదు ఏ ప్రాణికైనా ఎప్పుడైనా వర్తించేది ఒకే సూత్రం. ప్రతి ప్రాణిలోనూ దాగివున్న అంతస్సూత్రం.. అదే ఎన్నటికీ మారని 'జీవసూత్రం'.

---

ఈ వ్యవస్థను ధిక్కరించలేకపోతే నీవు మృత్యువును ధిక్కరించలేవు.

జీవించే ఆకాంక్ష పోరాడే ఆచరణగా మారినప్పుడు మృత్యువును పరిష్కారంగా ఎంచుకుంటుంది ఈ హంతక వ్యవస్థ. బానిసగా పడి వుండడమే బతికివుండడం అని నమ్మించిన యజమానీ, నమ్మిన బానిసా తిరగబడ్డ బానిస మరణం నుంచి జననం ప్రారంభమైందని గ్రహించలేరు.

— వి.వి.

సేకరణ: తవుటు నాగభూషణం